


నాకు చాలా ఉత్సాహంగా, ఉద్వేగంగా ఉంది. నైజీరియాలో ఉపాధ్యాయులు కావాలని అడ్వర్టైజ్‌మెంటు వస్తే హైద్రాబాద్‌నుండి ఓ పాతికమందే, తెలిసిన వారు అప్లై చేశారు తెలియని వారు యెందుకు చేశారో మరి. నాకు ఒక్కదానికే ఇంటర్‌వ్యూ కార్డ్ వచ్చింది. అందుకే ఉత్సాహం ఇంటర్‌వ్యూ ఇక్కడా, అక్కడా కాదు, ఢిల్లీలో ఉంది. ఛ . . ఛ . . ఢిల్లీ భయపడవలసిన అవసరము ఏముంది? శ్రీవారికి సెలవు దొరకదని తెలుసు. నేను ఇంటర్‌వ్యూకు వెళ్ళినా ఒంటరిగా నైజీరియాకు పంపుతారా? వారు పంపినా నేను వెళ్ళగలనా! రకరకాల ఆలోచనలతో వారు వచ్చే వరకు గడిపాను వారు విషయము విని చాలా సంతోషించారు.

"మన శర్మ అక్కడే ఉన్నాడుగా. వాడికి టెలిగ్రామిస్తాను," అన్నారు నా కంటే ఉత్సాహంగా. శర్మంటే మావారి క్లాస్‌మేటు, స్నేహితుడు కూడాను.

"వారింట్లో యెందుకండీ ఇంటర్ ఫ్యూకు వెడుతూ.." అన్నాను. హైదరాబాద్‌లో నాకయిన అనుభవాన్ని బట్టి సంవత్సరము పొడవునా ఏవో పనులు పెట్టుకుని ఊళ్ళనుండి వస్తూనే ఉంటారు. ఒకరు ఆస్పత్రికయితే, మరొకరు కోర్టు పనిమీద. ఇక వస్తుప్రదర్శన జరుగుతున్న నెల పదిరోజులు చెప్ప వలసిన పనే లేదు. వచ్చేవారు అర్ధరాత్రి, అపరాత్రి ఇబ్బంది పెట్టక ఇన్ని హోటల్లున్నాయి యెక్కడయిన దిగొచ్చుగా అనుకునేదాన్ని. చదువుకున్నవారు కూడా పది పన్నెండు గంటలకు తలుపులు తడితే పక్కలు అమర్చలేక యాతన అవుతుంది. అందుకే నేనొక నిర్ణయము తీసుకున్నాను. మనకు అందుబాటులో ఉన్న హోటల్లో ఉండాలిగాని యెవర్నీ ఇబ్బంది పెట్టకూడదు. అదే మాట మావారితో చెప్పాను.

"వాళ్ళింట్లో ఉండమనలేదు. సహాయంగా ఉంటారని.." ఆ తరువాత శర్మగారికి, టెలిగ్రామిచ్చి బయలుదేరాను. రెండు రాత్రుల ప్రయాణానంతరము కొత్తఢిల్లీ స్టేషన్ చూడగానే ప్రాణం లేచివచ్చింది. హోటల్లో ఉంటాను కదా అని బెడ్డింగు తెచ్చుకోలేదు. సీటుమీద పరిచిన బెడ్‌షీటు సూట్‌కేసులో సర్దుకుని సూట్‌కేసు పర్స్ పట్టుకుని బండి దిగాను. స్టేషన్ అంతా కలయచూచాను. శర్మగారి జాడ కనిపించలేదు. అలా చూస్తుండగానే జనము పలచబడ్డారు. మా టెలిగ్రాము అందిందో లేదో, యెలా? టాక్సీవాడిని అడిగి ఏదయినా హోటల్ చూపమంటే! సినిమాల్లో చూసినట్టు వాడు మరెక్కడికో తీసుకుపోతే! నా సిల్లీ ఆలోచనకు నాకే నవ్వు వచ్చింది.

"అద్గో అంకల్ ఆమె.." మాట వినిపించి తిరిగి చూచాను. శర్మగారి కూతురు సుధ, ఒకతని చెయ్యి పట్టుకుని నిల్చుంది.

"హాయ్ సుధా!" ఉత్సాహంగా సుధ చేతిని పట్టుకున్నాను. పదేళ్ళ సుధ యెంత యెదిగిన అమ్మాయిలా స్వాగతం చెబుతుందో!

"ఆంటీ, వెల్‌కమ్ టు ఢిల్లీ! బ్యాడ్ లక్ మమ్మీ, డాడీ లేరు," అన్నది.

"పరవాలేదులే.." ఆమె ప్రక్కన నిల్చున్న అతనివంక చూచాను, యెవరన్నట్టు

"సారీ, ఆంటీ, మా నేబర్, మా ఆంటి మాలతి" పరిచయము చేసింది. అతను చిన్నగా నవ్వి చేయి చాపాడు.

"నమస్తే!" అన్నాను.

"ఓ.. నమస్తే, నా పేరు రమా

కాంత్ సుధ మీ టెలిగ్రాము చూచుకుని కంగారుపడుతుంటే, నేను వచ్చాను."

"చాలా థాంక్స్," అన్నాడు. "దగ్గరలో ఏదయినా మధ్యస్తంగా ఉండే హోటలుందేమో చెబుతారా ?"

"హోటల్ యెందుకు ఆంటీ! అమ్మమ్మ ఉంది." సుధ కంగారుగా చెప్పింది.

"నాన్న, అమ్మ ఉన్నా నేను హోటల్లో దిగేదాన్నమ్మా."

"నిజమేనండీ. అలాంటి థాట్ మీకు రావటం చాలా సమంజసము. మన లేడీస్ ఉన్నారు చూడండి. ఒక ఇంట్లో ఇరికి ఆ ఇంటివారిని ఇబ్బంది పెడితేగాని తృప్తిగా ఉండదు," అన్నాడు. అతని మాటలు చాలా నచ్చాయి.

"హోటల్లో ఉన్నా, ఇంటికి వస్తాను సుధా" అన్నాను. అతను స్టేషన్ దగ్గర ఉన్న టూరిస్ట్ హోటల్‌కు తీసుకు వెళ్ళాడు. సింగల్ రూమ్స్ లేవన్నారు. డబుల్ రూమ్ బుక్‌చేసి, సామాను సర్దుకున్నాను. కాఫీ త్రాగి కబుర్లు చెప్పుకున్నాము. రమాకాంత్ చాలా మంచివాడులా కనిపించాడు. హాయిగా రెండు గంటలు గడిచాయి

"ఆంటీ నేను బడికి వెళ్ళి సాయంత్రం వస్తాను.

"మంచిది సుధా," అన్నాను.

"మరి నేను ఆఫీసుకు వెళ్ళివస్తాను." అతను లేచాడు. "మీరు పెద్దగా ఇబ్బంది పడవలసినపనిలేదు. ఇక్కడ సర్వర్స్‌తో చెప్పాను. మీకు ఏది కావాలన్నా అడగండి," అన్నాడు. వారిని లిఫ్ట్‌వరకు సాగనంపాను. రమాకాంత్ హోటల్ వారి విషయములో మాత్రం అతిశయోక్తి చెప్పాడేమో అనిపించింది. మద్రాసు, బొంబాయి వారంత ప్రాంప్ట్ సర్వీస్ ఉండదు. స్నానముచేసి, సబ్జెక్ట్‌లో అడుగుతారేమోనని ఇంటర్వ్యూ కోసము చదువుతూ కూర్చున్నాను. సమయమే తెలియలేదు. బెల్ ఒకటే పనిగా మ్రోగుతుంటే తలుపు తీశాను. రమాకాంత్ నిల్చున్నాడు.

"మీరు భోజనము చేశారా ?"

"ఆకలిగా లేదండి. ప్రయణాలలో కడుపు సరిగ్గా ఉండదు." ఇబ్బందిగా చూచాను. నిజానికి క్రితంరోజు టీ తప్ప ఏమీ తీసుకోలేదు.

"మీరు మొహమాటస్తులని ఇప్పుడు అర్థం అవుతుంది" అతను నవ్వి బేరర్‌ను పిలిచి రెండు భోజనాలకు ఆర్డర్ చేశాడు. అతను వచ్చి కూర్చున్నాడు. ఇంటర్‌వ్యూలు జరిగే పద్ధతి చెప్పాడు. భోజనము చేశాము. అతను బిల్ తెప్పించి తనే ఇచ్చాడు

"యెందుకండీ . ."

"ఫరవా లేదు," అన్నాడు. అక్కడ రూమ్ సర్వీస్ లేదట. డైనింగ్ హాలుకు వెళ్లాలట, తను బాగా తెలిసినవారని

తెచ్చారట. వారికి టిప్ కూడా బాగానే ఇచ్చారు.

"ఇంకా నయం. నేను రాకపోతే రేపటివరకు తినేవారే కాదు," అన్నాడు.

"విత్ యువర్ పర్మిషన్ . ." సిగరెట్టు తీశాడు.

" నాకేం అభ్యంతరంలేదు ," అన్నాను మరో పదినిమిషాలు కూర్చుని వెళ్ళిపోయాడు. మర్నాడు టాక్సీ తీసుకుని వచ్చాడు. అతను చూపించే ఆదరానికి ఉక్కిరి, బిక్కిరి అయ్యాము.

మేము టాక్సీ దిగాము. అది రంజిత్ ప్లేస్. లక్ష్మీనారాయణ మందిరానికి దగ్గరగా ఉంటుంది. పెద్ద అవరణలో మేడ, పై భాగము ఉంటున్నారట. కొన్ని కళ్లు చిత్రంగా చూడటం గమనించాను. రాజధానిలో కూడా ఇంకా ఇలాంటి కుతూహలము చూస్తే చికాకు వేసింది.

"ఆంటీ నీ కోసమే చూస్తున్నాను." సుధ పరుగు, పరుగున వచ్చింది.

"మా ఇంట్లో కాఫీ త్రాగి వెడదాం సుధా."

"ఓకే అంకల్ . . .'' ఉత్సాహంగా మా వెంట వచ్చింది. రమాకాంత్ ఉన్న ఫ్లాట్ చిన్నదే అయినా నీటుగా ముచ్చటగా ఉంది మమ్మల్ని డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోబెట్టి లోపలికి వెళ్లాడు. అతను వస్తుంటే కుతూహలంగా చూచాను. పరదా కదిలింది కాని యెవ్వరూ రాలేదు.




''చెప్పండి ఢిల్లీ బావుందా, మీ హైద్రాబాద్ బావుందా ?'' అతను చిన్నపిల్లను అడిగినట్టు అడుగుతుంటే నాకు నవ్వు వచ్చింది. అతని ముఖం చూస్తే ఇట్టే ఒక విషయము గ్రహించవచ్చు.

తన భావాలను బలవంతంగా అదిమి పట్టాడని తెలుస్తుంది.

''దేనికదే బావుంటుంది,'' అన్నాను. ఆ తరువాత మా మధ్య సంభాషణ బల వంతంగా జరిపినట్టు జరిగింది. అతను మాటిమాటికి లోపలివైపు చూస్తు న్నాడు.

''సుధా! అందరికి కాఫీ తెమ్మని చెప్పు.'' అతను అనగానే సుధ లోపలికి వెళ్ళింది. కాఫీట్రేతో పనిపిల్ల వచ్చింది.

''కమాన్...లల్లీ...పప్పీ...'' బల వంతంగా ఇద్దరమ్మాయిలను లాక్కు వచ్చింది సుధ.

''ఏమిటా బెట్టు...'' రమాకాంత్ గారి గొంతు కర్కశంగా వినిపించింది. ఇద్దరు పిల్లలు సాగదీయటం మాని నాకు నమస్కరించారు. ఆ చూపుల్లోని ఏహ్యత ఏమని వర్ణించేది? ఆ పిల్లలు సైకిల్ కేసులా! అసలెందుకలా చూస్తున్నారో అర్థంకాలేదు. నేను వారిని చూస్తూ ప్రతినమస్కారం కూడా మరచి పోయాను.

''మా అమ్మాయి లలిత, పద్మిని... నా చిన్నప్పుడు ఈ ఇద్దరు డాన్సర్స్ అంటే పడిచచ్చేవాడిని. అందుకే ఆ పేరు పెట్టుకున్నాను నవ్వు వచ్చింది, అతని ఆరాధనకి.

''రండమ్మా! ఏంచదువుతున్నారు?''

''నేను ఫిఫ్త్, చెల్లి థర్డ్''అని లోపలికి వెళ్ళిపోయారు. పనిపిల్ల కాబోలు కాఫీ పెట్టి వెళ్ళిపోయింది. అతను కోపంగా లోపలికి వెళ్ళాడు. అయిదు నిమిషాలకు తిరిగి వచ్చాడు.


'' తీసుకోండి చల్లారిపోతుంది.. ఆడవారు అలంకరించుకునేవరకు సాటి ఆడవారికి కనిపించరు. ఏంచేద్దాం మరి?'' ఆ మాటలో సహజత్వము యెక్కడా కనిపించలేదు.

'' పరవాలేదులెండి. '' అన్నాను. కాఫీ త్రాగి బల్లమీద కప్పు పెట్టాను. తల యెత్తేసరికి ఒకావిడ యెదుటి గుమ్మములో నిల్చుని నన్నే నఖ శిఖ పర్యంతము గమనిస్తుంది. ఆవిడ కళ్ళు నా మీదినుండి భర్తమీదికి, అటునుండి క్రిందికి ప్రాకాయి. కంగారుగా ప్రక్కకు చూచాను. రమాకాంత్ కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

''నమస్తే '' ఆవిడ బలవంతంగా నమస్కరించింది. నమస్కరించి, కుతూ హలంగా చూచాను. నేనూహించినంత పల్లెటూరిదేంకాదు. నవనాగరికురాలే. అంత బిడియము యెందుకో మరి!

''రా రమా! వచ్చి కూర్చో.'' అతను పిలిచాడు. వచ్చి బలవంతంగా పట్టుకువచ్చినట్టు కూర్చుంది.

''ఇక వెడదాం. '' లేచాను. అతను బయటివరకు సాగనంపాడు. ఇంట్లోకి వెళ్ళగానే శర్మ అత్తగారు రామాయమ్మ ఆప్యాయంగా యెదురు వస్తుందని ఆశిం



బాను ..విత హై|దాబాద్‌లో ఉండగా నా పనితనాన్ని తెగ మెచ్చుకునేది.

"మాలిణిని చూడవే, ఉద్యోగం చేస్తూ కూడా ఇంటిపని యెంత నేర్పుగా చేసుకుంటుందో, మీరంతా దుంగలు, దూలాలు మోసినట్టు బాధపడతారు," అనేది.

"ఊం...యెప్పుడు రాక" పొడిగా అడిగింది.

"నిన్ననే నండి."

"హోటల్లో దిగావుట. " నా దిక్కు చూడకనే గోరుచిక్కుళ్ళు తరుగుతూ అడిగింది.

"అవును. ఇక్కడి ఫ్లాట్స్, ఇబ్బందిగా ఉంటుందని..."

"అవున్లే హోటలయితే యదేచ్ఛగా తిరగొచ్చు. యెటువెళ్ళినా యెవరితో వెళ్ళినా హైద్రాబాద్‌లో ఉన్నవారికి తెలుస్తుందా, ఏం ? "

"అదేమిటి ? " తెల్లబోయాను.

"రమాకాంత్ నీకు తెలుసు ఉన్న మాట. "

"నిన్న సుధ పరిచయము చేసింది," అన్నాను. ఆవిడ నావంక చూచి వ్యంగ్యంగా నవ్వింది అదోలా! ఏమిటీ ! ఢిల్లీలో స్త్రీలే ఇలా ప్రవర్తిస్తారా ! ఆలోచిస్తూ నిల్చున్నాను. ఆవిడ కూర్చోమని అయినా అనలేదు. త్వరగా బయటికి వచ్చాను.

"వస్తాను సుధా ! అమ్మా, నాన్న వచ్చాక నేను వచ్చానని చెప్పు." అని మరో మాటలేక క్రిందకు దిగాను.త్వరగా రోడ్డెక్కి ఆటోను కేకవేశాను.

"చిలుక త్వరగా వెడుతుందేం ? " హిందీలో ఒక మగగొంతు అడిగింది. తల యెత్తి చూచాను గేటుదగ్గర ఉన్న కాపురాలవాళ్లు కాబోలు బాల్కనీలో నిల్చున్నారు.

"భార్య గడ్డి పెట్టిందేమో." స్త్రీ అంటుంది. నాకేం అర్థంకాలేదు. అటు నుండి వచ్చిన ఆటోరిక్షా యెక్కి హోటల్‌కి వచ్చాను. ఏం మనుషులు ! యెంత నీచంగా మాట్లాడారు! భోజనము కూడా చెయ్యక అలాగే పడుకున్నాను. యెప్పుడు నిదురపట్టిందో తెలియదు. మెలకువ వచ్చేసరికి తెల్లవారింది. కాలకృత్యాలు తీర్చుకుని, ఇంటర్‌వ్యూకు తయారయ్యాను. మళ్ళీ రమాకాంత్ రావటం, టిఫిన్ తెప్పించటం నాకు నచ్చలేదు త్వరగా క్రిందికి వెళ్ళి టిఫిన్ తీసుకున్నాను. అక్కడినుండి సర్టిఫికెట్లు తీసుకుని బయలుదేరాను. నా ఊహ నిజమే అయింది. రమాకాంత్ ఆటో దిగుతున్నాడు.

"నమస్తే .మీ ఇంటర్‌వ్యూ పదింటికి కదూ ! "

"ఊం" అన్నాను అతను రావటం నాకేమాత్రం నచ్చలేదు.

"ఇక వెడదామా ? "

"నేను వెళ్ళగలను లెండి."

"నాకేం పనిలేదండీ. సెలవు పెట్టాను."

"థాంక్స్. నేను వెళ్ళగలను మీరు సెలవు కేన్సిల్ చేసుకుని ఆఫీసుకు వెళ్ళండి," అన్నాను.అతను చిన్నబుచ్చుకున్నాడు

"యెందుకు ? ఆ వీధి మాకే కొన్నిసార్లు తిన్నగా దొరకదు," అన్నాడు.

"అది కాదండీ, పదింటికి అన్నారు. నా టర్న్ వచ్చేసరికి యెంత సమయము


అవుతుందో తెలియదు. అందుకని మీరు కూడా యెందుకు ?"

"అలా అయితే, అక్కడివరకు వచ్చి చూపిస్తాను" అన్నారు. గట్టిగా ఏదయినా అంటే ఇంక బాధపడతారేమోనని మౌనంగా అతన్ని అనుసరించాను. టాక్సీ చేసుకుని హోటల్ జన్‌పథ్ వెళ్ళాము, అతనికి థాంక్స్ చెప్పాను.

"హల్లో రమాకాంత్ !" ఒకతను వచ్చి అతని జబ్బ చరిచాడు. నా వైపు చూచి కన్ను గీటాడు. లాగి చెంపమీద కొడదాము అనుకున్నాను. ఇదేం కల్చర్ !

"ఏ ఊరి పిట్టరా ?"

"ఉష్ ! ఏమిటామాటలు ." అతను దూరం లాక్కుపోయాడు. ఇదేదో విషవలయములా ఉంది. ఘరానా బ్రోకర్స్ గురించి విన్నాను చాలా. అందుకే నా వెన్ను జలదరించింది. యెటు వెడుతుందని ఆలోచించక కనిపించిన మెట్లు యెక్కి పైకి వెళ్ళి బాల్కనీలో కూర్చున్నాను. రమాకాంత్ లోపలికి వచ్చి, నాకోసం చూచిఉంటాడు. ఓ అరగంట తరువాత అతను ఆటో యెక్కడం కనిపించి క్రిందికి దిగాను. అప్పుడు గుర్తుకు వచ్చింది ఇంటర్‌వ్యూ సంగతి. నా పేరు పిలిచారో ఏమో . అక్కడ అభ్యర్థులు కనిపించారు. గోలగా మాట్లాడుకుంటున్నారు. యెవర్ని అడగను, ఏం చేయను అనుకుంటుండగానే ఒకతను బయటికి వచ్చాడు. అతని



వెనుక వచ్చిన మరొకతను నా పేరు పిలిచాడు. కంగారుగా లోపలికి వెళ్లాను. వారడిగిన ప్రశ్నలన్నిందికి త్వరగా జవాబు చెప్పాను. మొదట తడుముకున్నా, అక్కడివారి ముఖాలలోని చిరునవ్వు చూచి ధైర్యం కూడదీసు

కున్నాను. ఇంటర్వ్యూ కాగానే ఒక్క నిముషం ఆలస్యం చేయకుండా హోటల్‌కు వచ్చి, సామాను తీసుకుని టాక్సీలో పెట్టాను.

"హోటల్‌లో ఉండాలని మీకు థాట్ రావటం చాలా సంతోషమండీ. మన లేడీస్ ఉన్నారు చూడండి, ఒక ఇంట్లో ఇరికి ఇంటివారిని ఇబ్బంది పెడితే గాని తృప్తిగా వుండదు." అంటున్న రమాకాంత్ ముందు నిలిచి నట్టు అయింది. ఉలిక్కిపడి చూదాను. అతను రాలేదు. నా భ్రమ అని అర్థం అయింది.

రిజర్వేషన్ లేకుండా రెండు రాత్రులు నానా అవస్థలుపడి హైదరాబాద్ చేరు కున్నాను. రమాకాంత్ విషయము మా వాళ్ళతో చెప్పాను.

"ఒంటరిగా ఢిల్లీలో ఉండలేనిదానవు నైజీరియా ఏం వెడతావ్?" అని వెక్కిరించారు. రెండు రోజులనంతరం అనుకోకుండా, శర్మ, అతని భార్య కనిపించారు. వారు ఢిల్లీ తిరిగి వెడుతూ మా యింటికి వచ్చారు. మిసెస్ శర్మతో ఆ అనుభవాలు చెప్పకుండా ఉండలేక పోయాను. అంతా విని ఆమె పక్కున నవ్వింది

"తాటి క్రింది పాలు సామెత విన్నావా..."

"ఆ విన్నాను. తాటిక్రింది పాలు త్రాగుచునుండిన మనుజులెల్ల గూడి మద్యమంద్రు..."

"పాపం నీ పరిస్థితి అలాగే అయింది. మాలతీ, రమాకాంత్ కథ చెప్పాలంటే చాలా ఉందిలే."

"చాలా వద్దుగాని టూకీగా చెప్పు." అన్నాను కుతూహలంగా.

"అతను దాదాపు పది సంవత్సరాలు పైలా పచ్చీసుగా గడిపాడు.అమ్మాయి. అంత యెందుకు, అతని జీవితంలో మదిరామదవతి కిచ్చిన ప్రాముఖ్యం తన జీవితానికి ఇవ్వలేదు. రోజుకో కొత్త మ్మాయి, అందుకే ఆ భార్య భర్త వెంట ఏ స్త్రీ వచ్చినా ఏవగించుకుంటుంది."

"అమ్మో! యెంత గండం గడిచింది" గుండెలమీద చేతులు వేసుకున్నాను.

"ఆ భయము అక్కరలేదు, మాలతీ. తనను కోరినవారినే వెంట వేసుకుని తిరుగుతాడు. ఇప్పుడా వ్యస నాలు మరిచాడు. రెండు సవంత్సరాల క్రితం అతనికి పెద్ద జబ్బు చేసింది అతన్ని యెవరూ నమ్మరు. అదే ట్రాజడీ" అన్నది. వాళ్లు సాయంత్రం. వెళ్ళిపోయారు. రమాకాంత్ పట్ల నేను ఏర్పరచుకున్న ఏహ్యభావము యెగిరి పోయింది. మనిషి తప్పుచేస్తే ఆ ముద్ర కలకాలముండేలా వేస్తారు మనవారు. పాపం అనిపించింది. ఇలాంటి సంఘటనలు యెన్ని యెదురవుతాయో బయటికి వెడితే. అందుకే వెళ్ళాలా, వద్దా అని ఆలోచిస్తున్నాను.